**కథ**

# సగటు మనుషులు

◆ బి.ఎల్.యన్. సత్యప్రియాధర్ ◆

సరిగ్గా ఉదయం ఐదు గంటలు కాగానే శత్రు సైన్యపు ఫిరంగిలా మోగింది అలారం.

ఉలిక్కిపడి లేచింది సావిత్రి. రాత్రి నిద్రపోయే సరికి చాలా పొద్దుపోయింది. నిద్ర సరిపోలేదంటూ కనురెప్పలు మూసుకుపోతున్నా, బలవంతంగా తెరుచుకుంటూ లేచి దినచర్య ప్రారంభించింది.

7 గంటలు కావస్తుంది. ఇంకా ఎక్కడిపని అక్కడే ఉంది. ఆఫీస్‌కి లేట్‌గా వెళితే బాస్‌తో తినే చివాట్లు గుర్తొచ్చి ఖంగారుగా కూరలు తరుగుతూ పొరపాటున వేలు కూడా తరుక్కుని కెవ్వుమంది.

"కాస్త ఒళ్ళు దగ్గరుంచుకుని తరగొచ్చుగా" పేపర్‌లోంచి తల తిప్పకుండానే కసురుకున్నాడు నారాయణ.

ఒక్క క్షణం భర్తకేసి ఆగ్రహంగా చూసింది. తను షేవింగ్ చేసుకుంటున్నప్పుడు కోసుకుంటే నేనెన్నిసార్లు పసుపద్దలేదు! దానికి ప్రతిఫలంగా ఓ సానుభూతి వాక్యం పలకొచ్చుగా! ఛీ... ఛీ! ఈ మగజాతికి మనసులేదు.


అసహనంగా అరుస్తున్నదామె మనసు. ఇంతలో బాబిగాడు స్నానం చేయనంటూ మొరాయించడంతో, సావిత్రి కోపం తారాస్థాయికి చేరి, వాడివి నాలుగు బాది, బాత్‌రూంలోకి లాక్కెళ్ళింది.

ఓ వైపు నుంచి "ఏమోయ్! నా స్నానానికి నీళ్ళు రెడియా?" అంటూ భర్త.

"అమ్మగారో... నేనొచ్చి సావుగంటైంది. ఇంకా తీసుకుపోవాల్సిన పిల్లలు చాలా మందున్నారు. ఇట్టాగైతే, నాకు్కదర్దమ్మగారూ!" అంటూ వాకిట్లో రిక్షావాడు పెట్టే గావు కేకలు.

సతమతమైపోతోంది సావిత్రి.

ఎలాగైతేనేం బాబిగాడిని పంపించి, శ్రీవారికి టిఫినకి, బాక్స్‌లు సర్ది, టైం చూసింది. తొమ్మిదీ ముప్పై. వెంటనే బస్ దొరికితే పదింటికల్లా ఆఫీస్




చేరొచ్చు.

కాని తను తెమిలి బయటపడి, బస్ కోసం వెయిట్ చేస్తే పదిక్కడే ఐపోతుంది. పెద్దపులిలా బాస్ గుర్తొచ్చాడు. బాక్స్ తీసుకెళుతున్న భర్తని రిక్వెస్ట్ చేసింది.

"ఏవండీ! టైమ్ లేదు, ఇవాళొక్క రోజు, మా ఆఫీస్ దగ్గర డ్రాప్ చేసి వెళ్ళండి ప్లీజ్!"

"అమ్మో! నా వల్ల కాదు. నువ్వు చీర సింగారించి బయలుదేరే సరికి, పుణ్యకాలం పూర్తవుతుంది. ఆ తరువాత నన్ను మా బాస్ బాయిల్డ్ చికెన్‌లా తినేస్తాడు, లేట్‌గా వెళ్ళటం, చివాట్లు తినడం నీకలవాటేగా! కాబట్టి నిదానంగా వెళ్ళు, నేను మాత్రం వెళ్ళొస్తా!" అంటూ స్కూటర్ స్టార్ట్ చేసి వెళుతున్న భర్తని అసహనంగా చూస్తుండిపోయింది.

"మీలాగే నేనూ, నా పని వరకు చేసుకుని వెళ్ళితే మీకన్నా ముందుగానే వెళ్ళగలను" మనసులోనే ఉడుక్కుంటూ, బయల్దేరింది.

టీజింగ్స్ భరిస్తూ, బస్‌స్టాప్‌లో పడిగాపులు పడి, ముష్టియుద్ధం చేస్తూ బస్ క్యాచ్ చేసి, ముప్పావుగంట లేట్‌గా ఆఫీసర్ ముందు నిలబడింది.

ఆమె మెదడుని ఫ్రై చేసుకుని తినేసి, వార్నింగ్ లిచ్చేసి, ఇంక వెళ్ళమన్నట్టుగా చూసాడు బాస్!

బ్రతుకు జీవుడా అనుకుంటూ వెళ్ళి సీట్లో కూర్చొని ఫైల్ తెరిచింది.

ఒక గంట కల్లా పూర్తిగా అలసట వచ్చేసింది. కళ్ళు మూతలు పడుతున్నాయి. వేలు కోసుకోవడం వల్ల రాయడానికి బాధగా ఉంది.

ఎదురుగుండా వాల్ క్లాక్ ఐదున్నర చూపిస్తోంది. పెండింగ్ ఫైల్స్ చాలా ఉన్నాయ్! రేపు సండే కాబట్టి ఇంటి దగ్గర చెయ్యొచ్చని, వాటిని తీసుకుని బయల్దేరింది.

శాలరీని పదిలంగా పర్స్‌లో దాచుకుని, ఇంటి దగ్గర ఎదురుచూసే శ్రీవారిని బాబిగాడిని తల్చుకుంటూ బయల్దేరింది.

★ ★ ★

ఆఫీస్‌లో ఆడిటింగ్ జరుగుతోంది. నారాయణ మెదడు నరాలు చిక్కేలా ఎకౌంట్స్‌తో కుస్తీ పట్టీ పట్టీ తలపట్టుకు కూర్చున్నాడు.

◆◆◆

**కూరగాయలతో పాటు వేలు కూడా కోసుకుంది సావిత్రి.**

◆◆◆

"ఇంకో రౌండ్ టీ కొడదామా?" అడిగాడు కొలీగ్.

"ఇక నావల్ల కాదు గురూ! అంతగా ఐతే, రేపొచ్చి వేస్తాను" అంటూ బయలుదేరాడు.

తలంతా భారంగా ఉంది. ఇంటికెళ్ళి తన సావిత్రి కాఫీ తాగుతూ ఆమె సపర్యతో, తన అలసటంతా మరిచిపోవాలని ఆలోచిస్తూ బైక్ స్టార్ట్ చేసాడు.

ఆత్రంగా ఇల్లు చేరినతనికి, తాళం వెక్కిరిస్తూ కనబడ్డది. నారాయణ మరీ నీరసపడ్డాడు.

అప్పుడే స్కూల్ బ్యాగ్‌ని భారంగా మోస్తూ వస్తున్నాడు బాబిగాడు.

తండ్రిని చూడగానే ఆత్రంగా అడిగాడు.

"మమ్మీ ఇంకా రాలేదా డాడీ?" వాడి గొంతులో ఎంతో దిగులు ధ్వనించింది.

ఒక్కసారిగా వాడిపై విపరీతమైన జాలి పుట్టింది నారాయణకి. కొడుకుని దగ్గరికి తీసుకుని, ఆప్యాయంగా తల నిమురుతూ చెప్పాడు.

"వస్తుందమ్మా... ఈ పాటికి వచ్చేస్తూ వుంటుంది. అప్పుడే ఫైళ్ళు మోసుకుంటూ వచ్చింది సావిత్రి."

"సావి! మాంచి వేడి వేడి కాఫీ జండుబామ్ త్వరగా పట్టా క్విక్!" ఈజీ ఛైర్లో కూలబడ్తూ అన్నాడు.

"నా వల్ల కాదండీ! నాక్కూడ అలసటగా ఉంది. ఫ్లాస్క్‌లో కాఫీ ఉంది పోసుకుని తాగండి! దయుంటే నాకూ ఓ కప్పు పట్టాండి!"

అంటూ ఫైళ్ళన్నీ టేబుల్‌పై పడేసి, మంచంపై వాలింది.

"ఏంత జాబ్ చేసేదానివైతే మాత్రం ఇంత పొగరా. మొగుడికే పనిచెప్తావన్నమాట!" క్రోధంగా అరిచాడు.

"మొగుడా, పెళ్ళామా?" అన్న సమస్య కాదు! కనీస మానవత్వంతో ప్రవర్తించమంటున్నా!"

సావిత్రి గొంతుకూడ ఖంగుమంది.

"ఐతే నాకు మానవత్వం లేదు నేనో రాక్షసుడినవేగా, నీ అభిప్రాయం!" అతనిలో కోపం, మక్కాల కంటేంది.

ఇద్దరిలోనూ ఉదయం నుంచి పేరుకున్న చిరాకు రాజుకోసాగింది.

మళ్ళీ రణరంగం మొదలైందని తెలుసుకున్న బాబిగాడు, భారంగా ఉన్న స్కూల్ బ్యాగ్‌ని లేపి భుజానికి తగిలించుకుని.

"మమ్మీ! నేను ట్యూషన్‌కి వెళుతున్నా" అంటూ దిక్కుముఖమేసుకుని చెప్పాడు.

◆ ◆ ◆

# 'మొగుడా, పెళ్ళామా' అన్న సమస్య కాదు! కనీస మానవత్వం అన్నది ఉండాలి!

◆ ◆ ◆

వాడిని క్షణం సేపు చూసారిద్దరూ! వాడి ముఖంలో అలసట, అసహనం, స్పష్టంగా కనిపిస్తోంది. స్కూల్ బ్యాగ్ భారాన్ని బలవంతంగా భరిస్తున్నట్టు, పెదవులు నొక్కిపట్టాడు.

సావిత్రి నారాయణ మనసులు ద్రవించి పోయాయ్.

"ఛీ! నేను ఒక తల్లినేనా! ఈ పసివాడికి తల్లి ప్రేమనేమాత్రం అందించగల్గుతున్నాను?"

ఉస్సూరుమంటు వచ్చిన భర్తకి, కనీసం ఊరటని కూడ కల్గించలేక పోతున్నాను. అయాం అన్‌ఫిట్ ఇన్ మై లైఫ్" ఆమె కళ్ళల్లో నీరు చిప్పిల్లుతోంది.




నాలో జీర్ణించుకున్న పురుషాహంకారం, సన్నామాటలని అనిపించింది కాని, పాపం! సావి ఇంటి పనితో ఆఫీస్ పనితో ఎంత సతమతమైపోతోందో... ఈ బిజీ లైఫ్ వల్ల ఒక్కరోజైనా సావిని సంతోషంగా ఉంచలేకపోతున్నా!

సెలవురోజుల్లో కూడ ఆఫీస్ వర్క్ తప్పటం లేదు! సకుటుంబంగా సినిమాకెళ్ళి ఎన్నాళ్ళయ్యిందో!

బాబిగాడిని కన్నాం కాని ఆ కన్న ప్రేమని ఇద్దరమూ పంచలేకపోతున్నాం!

డబ్బు సంపాదించి వాడవసరాలు తీరుస్తున్నాం! కాని ఆ పసి మనసు కోరే అనురాగాన్ని ఏమాత్రం అందిస్తున్నాం?

నారాయణ మనసు, బాధగా మూల్గుతోంది.

పర్సులోంచి, ఆ నెల కష్టార్జితాన్ని తీసి టీపాయ్ పై పెట్టాడు. సావి కూడ తన బ్యాగ్‌లోంచి శాలరి తీసి టీపాయ్ పై పెట్టింది.

ఇద్దరూ బాబిగాడిని దగ్గరికి తీసుకున్నారు.

"డాడీ! రేపు సండేకదా! నన్ను జూకి తీసుకెళ్ళరా!" గారంగా అడిగాడు.

"సారీ రా! రేపు కూడా ఆఫీస్ కెళ్ళాలి నేను మమ్మీ తీసుకెళ్ళుతుందిలే!" బుజ్జగిస్తున్నట్టుగా అన్నాడు. వెంటనే అంది సావిత్రి.

భలేవారే! రేపు ఫైల్స్ కంప్లీట్ చెయ్యకపోతే మా బాస్ బ్రహ్మరాక్షసుడిలా విరుచుకుపడతాడు.

నాకెలా కుదుర్తుందండి!" దీనంగా చెప్పింది సావి.

బాబిగాడు ఉక్రోషంగా ఇద్దరి వైపు చూసి, విసురుగా వాళ్ళ దగ్గర్నుంచి లేచివెళ్ళి ఎదురుగా ఉన్న గోడకానుకుని కోపంగా టీపాయ్‌పై పెట్టిన డబ్బుకేసి తన తల్లిదండ్రులకేసి మార్చి మార్చి చూడసాగాడు.

ఆ పసివాడి చూపుల్లో అర్థాలు అనేకం!

డబ్బు కోసం రోజంతా తాపత్రయపడిపోతున్నారే తప్ప ప్రేమా, ఆత్మీయతా, అనురాగం, అనే వాటి గురించి ఎప్పుడైనా ఆలోచించారా!

ఈ యాంత్రిక జీవితం, మీకు, సంతోషాన్ని కల్గిస్తోందా?

ఈ డబ్బుతో మన అవసరాలు తీర్చగలుగుతున్నారు, మన మధ్య లోపిస్తున్న పరస్పరాభిమానాన్ని తిరిగి సాధించగలరా?

అన్నట్టు వాడి చూపులు సూటిగా వాళ్ళ మనసులకి తగులుతున్నాయి.

మేం సగటు మనుషులం...

మేం నిస్సహాయులం...

అన్నట్టుగా వాళ్ళ చూపులు నేలని తాకాయి.

●